క్లుప్తంగా

మహాధర్నాకు తరలిరావాలి

గుంతకల్లు రూరల్: విజయవాడలో ఈనెల 12న నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధి కూలీలు భారీఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీ.శ్రీనివాసులు కోరారు. సీపీఎం మండల నాయకులతో కలిసి ఆయన సోమవారం మండలంలోని జీ.కొట్టాల, తిమ్మాపురం గ్రామాల్లో పర్యటించారు. కూలీల న్యాయమైన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మహాధర్నా చేపడుతున్నామన్నారు. సీపీఎం మండల నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరులో ఉన్న మౌర్య పాఠశాలలో సోమవారం సరస్వతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కరస్పాండెంట్ ఆంజనేయులు సూచించారు.

సద్భావన శాంతి యాత్ర



శాంతి యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో సోమవారం విశ్వ శాంతిని ఆకాంక్షిస్తూ సద్భావన శాంతి యాత్ర నిర్వహించారు. బ్రహ్మకుమారీల కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో గుత్తి, పుట్టపర్తి బ్రహ్మకుమారీల సంచాలకులు వరలక్ష్మి, లక్ష్మి , గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, సీఐ వెంకటేశ్వర్లు, సత్యసాయిబాబా భక్తులు రమణ, సత్యనారాయణరెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ పారిశుధ్యం-పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ సభ్యులు, వాష్ జిల్లా కో ఆర్డినేటర్ ఆర్.లక్ష్మీదేవి, ఏపీఎం ఖలీల్ సూచించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నీటి పారిశుధ్యం- పరిశుభ్రత పై అవహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు రోడ్లపై పారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కలుషితమైన నీరు తాగడం వలన కలిగే నష్టాలను వివరించారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల లీడర్లు, అనిమేటర్లు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు



బహుమతులు అందజేసిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో టెస్ట్ మోడల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆధ్వర్యంలో టెస్ట్ మోడల్ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం, గేట్స్ డైరెక్టర్ వీకే వాణి, హెచ్ఎం సుబహాన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమలక ఏకాదశి పూజలు



భోగేశ్వరుడు



ప్రసన్న పార్వతి

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయం, చిన్న విఠోబ దేవాలయంలో సోమవారం అమలక ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆదిదంపతులు శివపార్వతులు, పాండురంగస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. ఆయా ఆలయాల్లో వేదపండితులు దేవగుడి రామేశ్వరశర్మ, చంద్రమౌళి శర్మ, అనిల్ తదితరుల మంత్రోచ్చారణల నడుమ విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భావసారక్షత్రియ భజన బృందంచే రుక్మిణీ పాండురంగస్వామికి సంకీర్తనాలాపన చేశారు. భోగేశ్వరాలయంలో ఆదిదంపతుల విగ్రహాలను ప్రకాష్, కళ్యాణి దంపతుల సౌజన్యంతో శోభాయానంగా అలంకరించారు. ఈసందర్భంగా పలువురు బాలలకు నామకరణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



శింగనమలలో పోస్టర్లను విడుదల చేస్తున్న సాకే శైలజానాథ్, వీరాంజనేయులు, తలారి రంగయ్య తదితరులు



యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో యువత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



గుంతకల్లులో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

- 12న యువత పోరు విజయవంతం చేయండి
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: యువత, నిరుద్యోగులను, ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని, ఈ నెల 12న అనంతపురంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. సోమవారం శింగనమలలోని వాసవీ కల్యాణమండపంలో నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయనతోపాటు మాజీ ఎంపీ తలారి రంగయ్య, నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వాసవీ కల్యాణ మండపం వరకూ వచ్చారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో శైలజానాథ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి పార్టీల అబద్ధపు హామీలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలలైనా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం వల్ల, యువత చదువుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు రూ.3,700 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి ఉండగా, చెల్లించలేదన్నారు. నిరుద్యోగ భృతి హామీ అటకెక్కించారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలదీసేందుకు ఈనెల 12న జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి, కలెక్టర్‌కు సమస్యలు విన్నవిద్దామన్నారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు మాట్లాడుతూ కూటమి పార్టీలు అబద్ధపు హామీలిచ్చి, ప్రజలను మోసం చేశారన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ కూటమి పార్టీలు సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చి , ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, చాములూరు రాజగోపాలు, నవీన్ , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' జయప్రదం చేయండి

పామిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం 10 గంటలకు నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్ కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ సమస్యలపై ఈ పోరు చేపట్టామన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించడంలో కూటమి విఫలం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని జెడ్పీటీసీ భాస్కర్ మండిపడ్డారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని జెడ్పీటీసీ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

విద్యారంగానికి 'చంద్ర' గ్రహణం

గుంతకల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్యా రంగానికి చంద్ర గ్రహణం పట్టుకుందని గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 12న జిల్లా కేంద్రంలో తలపెట్టిన యువత పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు కళాశాల యాజమాన్యాల నుంచి ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులు ఒత్తిడిని భరించలేక బలమన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత జగనన్న ప్రభుత్వంలో విద్యారంగానికి పెద్ద పీట వేశారన్నారు. ఇందుకు నిదర్శనం 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో పెండింగ్ ఉంచిన రూ.1790 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్లు బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతిని చెల్లించాలన్నారు. అంతేకాకండా కొత్త మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసహరించుకోవడంతోపాటు పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యా రంగాన్ని పటిష్ట పరచాలనే ఉద్దేశ్యంతో జగనన్న పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమంలో యువతతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, నిరుద్యోగులు పార్టీలకు అతీతంగా పాల్గొని తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ వై.నైరుతిరెడ్డి, పట్టణ, మండల కార్యదర్శులు ఎండీఆర్ ఖలీల్, రాము, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్, కౌన్సిలర్లు సుమోబాషా, కుమారి, వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంశీయాదవ్, పార్టీ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి అబ్దుల్‌బాసిద్, నారప్ప, రంగనాయకులు, వీరేష్, షాబుద్దీన్, బాబురావు, బావన్న, వార్డు ఇంచార్జులు శివ, దర్గనాయుడు, నాయకులు నూర్‌నిజామి, జయరామ్‌రెడ్డి, న్యాయవాది ఆఫీఫ్, ఎంఎం రహిమాన్, సిపాయి బాషా, తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ ఈనెల 12న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో ఉన్న ఆయన స్వగృహంలో ఫీజుపోరు పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈనెల 12న విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళనతో పాటు కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తామన్నారు. ఇప్పటి వరకూ రూ.3,900 కోట్లు విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలు, ఫీజులు చెలించక కూటమి ప్రభుత్వం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో చెలగాటం ఆడుతోందన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు.

వాహనం పోయిందా.. దొరికితేనే కేసు!

తాడిపత్రిటౌన్: పోయిన వాహనం దొరికితేనే కేసు నమోదు చేస్తాం అంటూ స్టేషన్‌కు వచ్చిన బాధితులను పోలీసులు తిప్పిపంపుతున్నారు. దీంతో పోలీసుల తీరుపై తాడిపత్రి ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. వివరాలు.. శివరాత్రి రోజు మున్సిపల్ ఆఫీసు ఎదురుగా కేఫ్‌లో టీ తాగడానికి వెళ్లిన ఆనంద్ అనే వ్యక్తి బయటకు వచ్చి చూసేసరికి తన ద్విచక్ర వాహనం కనబడలేదు. దీంతో నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయండని కోరడంతో.. వాహనం దొరికితే అప్పగిస్తాం అంటూ కేసు నమోదు చేయకుండా పంపారు. వరుసగా వారం రోజులుగా కేసు నమోదు చేయండి సార్ అంటూ కాళ్లరిగేలా తిరుగుతూ విన్నవించినా ఏ మాత్రం ఫలితం లేక పోయింది. గత మూడు నెలల్లో తాడిపత్రి పట్టణంలో దాదాపు ఆరు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విడ్డూరం. గత మూడు నెలలుగా పోలీస్ రికార్డులు పరిశీలిస్తే ఆగస్టులో ఒకటి, డిసెంబర్‌లో రెండు ద్విచక్రవాహనాల చోరీ కేసులు నమోదు చేశారు. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే గత డిసెంబర్‌లో వైఎస్సార్ జిల్లాలో ద్విచక్రవాహనాల దొంగ దొరకడంతో.. పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం నెంబర్, చిరునామాలతో బాధితులను స్టేషన్‌కు పిలిచి అప్పుడు కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాలను అప్పగిస్తున్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

తాడిపత్రి: వాహనదారులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి సూచించారు. వాహన తనిఖీలో భాగంగా సోమవారం నంబర్ ప్లేట్ లేని తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను బండిలో ఉంచుకోవాన్నారు. ధ్రువీకరణ పత్రాల లేకపోతే రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లను అంటించుకున్న వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే ద్విచక్రజు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సూచించారు.

పారిశ్రామిక రంగంపై అవగాహన పెంచుకోవాలి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక రంగంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వైఎస్సార్ జిల్లాలోని ముద్దనూరులోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఆటీపీపీ)ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు పారిశ్రామిక రంగం ఏర్పాటుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్శనలో విద్యుత్ ఉత్పత్తి సౌకర్యాలు, వాటి పని తీరుపై అవగాహన కల్పించారు. ప్లాంట్ కార్యకలాపాలు, ఇంధన నిర్వహణ, బాయిలర్ పనితీరు టర్బైన్ కార్యకలాపాలు, విద్యుత్ పంపిణీ విధానాలపై వివరించారు. ప్లాంట్‌లోని ఇంజినీర్లు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి వాటి ప్రాముఖ్యత, పర్యావరణ పరిశ్రమలోని భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఈఈఈ విభాగం అధిపతి డాక్టర శివ లింగమయ్య, కేటీ ప్రశాంతి, డాక్టర్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు, అధ్యాపకులు

మౌలిక వసతులు కల్పించండి

గుంతకల్లు: శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని పట్టణ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి మాట్లాడుతూ పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీలో వేలాది కుటుంబాలు నివాసమున్నాయన్నారు. కాలనీలో తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు. వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా శ్రీలంక కాలనీ వాసులు గుక్కెడు నీటి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో మున్సిపల్ అధికారులు విఫలయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు లేవన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, రేవతి, వెంకట లక్ష్మి, కాలనీవాసులు ప్రమీలా, లక్ష్మీ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుత్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

కూటమి బెదిరింపులకు బెదరని అంగన్‌వాడీ సిబ్బంది

తాడిపత్రి రూరల్: అధికారుల బెదిరింపులు, పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా అంగన్‌వాడీలు సోమవారం పట్టణంలోని కేంద్రాలను మూసివేసి మహా ధర్నాకు మద్దతుగా నిలిచారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మెడలు వంచి అమలు చేసేందుకు చలో విజయవాడ పేరుతో నిర్వహించిన మహా ధర్నాకు హాజరయ్యారు. వారిని మహాధర్నాకు వెళ్లనీయకుండా విజయవాడకు వెళ్లే రైళ్లల్లో తనిఖీ చేసేందుకు ఆయా రైల్వే స్టేషన్లలో పోలీసులు కాపు కాచి పలువురు అంగన్‌వాడీలను బలవంతంగా కిందకు దింపారు. అయినా వారు ఇతర మార్గాల్లో విజయవాడకు చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు. కాగా ఎంతమంది అంగన్‌వాడీలు మహా ధర్నా పేరుతో విజయవాడకు వెళ్లారు? ఎంతమంది అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి మద్దతుగా నిలిచి ఇంటికే పరిమితమయ్యారన్న దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బుక్కరాయసముద్రం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ మండల కార్యదర్శి నాగేంద్ర ధ్వజమెత్తారు. సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అనంతపురం - తాడిపత్రి రహదారిపై మానవ హారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో ధర్నా వెళ్తున్న అంగన్‌వాడీ సిబ్బంది ఎక్కడికక్కడ పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, గీతమ్మ, సరళ, లక్ష్మి, శంకరమ్మ, నాగేంద్రమ్మ, షమీనా, సరస్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో జరిగిన మహా ధర్నాలో ముందు వరుసలో తాడిపత్రికి చెందిన అంగన్‌వాడీలు

రేపటి నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవాలు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి శివారులో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 12న పల్లకి సేవతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 13న గణపతి పూజ, సుదర్శన హోమం, 14న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామి రథోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15న రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. భక్తులు హాజరై ఉత్సవాలు విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

చేనేతల సమస్యలు పరిష్కరించండి

పెద్దవడుగూరు: చేనేత కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో సీపీఐ గ్రామ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామ కమిటీ కార్యదర్శి అల్లాబకాస్, సహాయ కార్యదర్శులు బద్దెల రామాంజనేయులు, శేషు, కార్యకర్తలు రంగస్వామి, రామాంజనేయులు, దాసు, చిన్నగంగులు, కంబగిరి పాల్గొన్నారు.

పెద్ద కదిరప్ప స్వామి ఊరేగింపు



పి.ఎర్రగుడిలో ఊరేగుతున్న కదిరప్పస్వామి

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి, అనగానదొడ్డి, పి.ఎర్రగుడి, అబ్బేదొడ్డి గ్రామాల్లో సోమవారం పెద్ద కదిరప్ప స్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు మండలం వెంకటాంపల్లి గ్రామంలోని కొండపై వెలసిన పెద్ద కదిరప్పస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం వందల ఏళ్ల నుంచి కొనసాగుతోంది. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా ప్రధాన అర్చకుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పెద్ద కదిరప్ప స్వామి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గుంతకల్లు, గుత్తి, పామడి మండలాల్లోని గ్రామాల్లో స్వామిని ఊరేగించి.. ఉగాది పండుగ నాటికి వెంకటాంపల్లి కొండపై వెలసిన ఆలయంలో ఉత్సవ విగ్రహాన్ని చేర్చడంతో కార్యక్రమం ముగుస్తుందని అర్చకుడు తెలిపారు.

'రక్షణ కల్పించండి'

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ప్రేమ వివాహంంంం చేసుకున్న ఓ జంట రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. వివరాలు.. మేరకు బీకేఎస్ మండల కేంద్రంలో గౌరయ్య కాలనీకు చెందిన రాజు, రేఖా రాణి కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నారు. అయితే అమ్మాయి తరఫున బంధువులు వారిని బెదిరిస్తున్నారు. ఈ క్రమంలో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

కారు బోల్తా - దంపతులకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట శివారున 44వ జాతీయ రహదారిపై సోమవారం ఓ కారు అదుపు తప్పి బోల్తాపడింది. పోలీసులు తెలిపిన మేరకు కర్నూలులోని పార్క్ రోడ్డులో ఉన్న అలంకార్ ప్లాజాలో నివాసముంటున్న మోహన్ గురుసాయి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. వీకెండ్ కావడంతో రెండు రోజుల క్రితం భార్య మౌనికతో కలసి కర్నూలుకు వచ్చిన ఆయన సోమవారం ఉదయం కారులో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. కొత్తపేట శివారులోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన స్తంభానికి ఢీకొని ఆగిపోయింది. ఘటనలో మోహన్ గురుసాయి, మౌనిక దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు కర్నూలుకు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



వైద్యులు, నర్సులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని పురావస్తు శాఖ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రిలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్, సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, నర్సులు, పురావస్తు మహిళా సిబ్బందిని సత్కరించారు. గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిలాన్, చిరంజీవి పాల్గొన్నారు.

27న సామాజికి తనిఖీ 'ప్రజా వేదిక'

పుట్లూరు: మండలంలో 2023-2024లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 27న ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3న ప్రారంభమైన సామాజిక తనిఖీలు 26వ తేదీ వరకూ కొనసాగడంతో పాటు ఆయా గ్రామ పంచాయతీలలో సభలను నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రజావేదిక ఉంటుందన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాడదాం'

శింగనమల: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పోరాడుదామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ అన్నారు. సోమవారం శింగనమలలోని రామాలయంలో ఆ పార్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు కోసం నిరంతరం పాటుపడుదామన్నారు. ఈ సందర్భంగా సీపీఐ, రైతు సంఘం నుంచి 150 మంది సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీలో చేరారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, వీరనారప్ప, తరిమెల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆటో బోల్తా.. వృద్ధురాలికి గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకులపల్లి సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడి ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. దాసరి లక్ష్మమ్మ అనే వృద్ధురాలు చింతలచెరువు నుంచి పెద్దవడుగూరు రావడానికి పెద్దపప్పూరు మండలానికి చెందిన ఎక్కలూరు గ్రామానికి చెందిన ఆటో ఎక్కింది. ఆటో మేడిమాకుపల్లి దాటిన అనంతరం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే క్షతగాత్రురాలిని 108 వాహనంలో పెద్దవడుగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ శ్రీనివాసబాబు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆమెను అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

నివాళి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పాతకోటకు చెందిన సీపీఐ నాయకుడు గోపాల్(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ పట్టణ కార్యదర్శి చిరంజీవి, ఇతర నాయకులు గోపాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

గార్లదిన్నె: మండల కేంద్రంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుళ్లాయప్ప మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పెద్దవడుగూరు(యాడికి): యాడికిలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం గర్భిణలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు పరమేశ్వర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.